
# హక్కుల తాత్వికుడు మన బాలగోపాల్

ఆంధ్రప్రదేశ్‌లో హక్కులసంఘానికి పెద్ద చరిత్ర వుంది. 1970 దశకం మొదటి భాగంలో ప్రారంభమైన పౌరహక్కులసంఘం పనిచేస్తున్న క్రమంలో వివిధ దశలను దాటుకుంటూ ముందుకు సాగింది. ఒకానొక చారిత్రిక దశలో బాలగోపాల్‌గారు దాంట్లోకి ప్రవేశించి, హక్కులఉద్యమానికి ఒక తాత్విక చింతనను, ప్రత్యేకమైన హక్కులభాషను, ఒక ఒరవడిని ప్రవేశపెట్టి ఇంకా ముందుకు తీసుకెళ్ళాడు. 1974లో వరంగల్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిగా చేరి, అక్కడ చదువుకుంటూ అక్కడి పరిస్థితుల ప్రాబల్యంతో, ఒక చారిత్రిక నేపథ్యంలో హక్కులఉద్యమంలోకి అడుగుపెట్టాడు. నక్సల్‌బరీలో అంటుకున్న గిరిజన, రైతుల, రైతు కూలీలపోరాటాలు 1970 దశకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చుట్టు ముట్టాయి. ముందుగా శ్రీకాకుళం అడవుల్లో ఫారెస్ట్ కాంట్రాక్టర్లు, వ్యాపారులదోపిడీకి వ్యతిరేకంగా మొదలై క్రమ, క్రమంగా మైదాన ప్రాంతాల్లోకి, కొన్ని చోట్ల కొండపల్లి సీతారామయ్య గారినే త్రత్వంలో, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చంద్ర పుల్లారెడ్డి గారి నేతృత్వంలో రైతు–కూలీ సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రజలసమస్యలపై ముఖ్యంగా ఫారెస్టులో ఆదివాసీలపై దోపిడీ, గ్రామీణ మైదాన ప్రాంతాలలో భూమి కేంద్రంగా చేసుకొని దోపిడీ సమాజాన్ని కూల్చివేసి నూతన ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించాలనే దిశగా ప్రారంభమైనవి. ఉవ్వెత్తున లేచిన ఈ ఉద్యమాలు ప్రభుత్వానికి తీవ్ర భయం కల్గించాయి. ఈ ఉద్యమాలు లేవనెత్తిన ప్రశ్నలకు, అవి ముందుకు తెచ్చిన సమస్యలకు జవాబు ఇచ్చుకోలేని ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఉద్యమాలపై దమనకాండ ప్రారంభించింది. నక్సలైటు నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం, జైళ్ళలో పెట్టడం, తప్పుడు కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా భౌతికంగా ఎదురు కాల్పులపేరుతో హత్యగావించే ఒక ప్రక్రియను కూడా మొదలు పెట్టింది. ఈ ప్రక్రియకు బ్రిటిషు వాడు స్వాతంత్రోద్యమ పోరాటంలో అంకురార్పణ చేసాడు. అదే ఆనవాయితీని కాంగ్రెసు ప్రభుత్వం కొనసాగించింది. ఆ తరుణంలో రైతాంగం పోరాటం ఎదుర్కొంటున్న తీవ్ర నిర్బంధాన్ని, ప్రజలపై, విప్లవకారులపై అప్పటి ప్రభుత్వం అమలు చేస్తున్న పాశవిక దమనకాండను ఎలుగెత్తి ఖండించడానికి, ఉద్యమాలకు ఒక నైతిక మద్దతు ఇవ్వడానికి 1970లో పౌరహక్కుల సంఘం ఏర్పడింది. ఈ సంఘంలో రచయితలు, డాక్టర్లు, ప్రజాస్వామిక వాదులతోపాటు విప్లవ పార్టీ సానుభూతిపరులు, ప్రజా సంఘాలప్రతినిధులు కూడా సభ్యులుగా చేరారు. దాదాపు అయిదు సంవత్సరాలు మహాకవి శ్రీశ్రీ నాయకత్వంలో ఈ సంఘం ప్రభుత్వం చేస్తున్న దమనకాండపై విస్తృతంగా ప్రచారం చేసి, విప్లవ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విప్లవ పార్టీ సిద్ధాంతాలను కూడా తమ బాధ్యతగా ప్రచారం చేసింది. అప్పటికింకా నిజనిర్ధారణ కమిటీలు వేసి విషయాలు సేకరించడం, కోర్టులముందు వాదించడం, ప్రభుత్వాన్ని రిపోర్టులద్వారా నిలదీయడం లాంటి కార్యక్రమాల పద్ధతులు అమలులోకి రాలేదు. 1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్ ఉద్యమాలపై ఉక్కు పాదం మోపి ఎన్‌కౌంటర్ హత్యలు తీవ్రతరం చేసాడు. ఎమర్జెన్సీ ప్రకటించిన తర్వాత అది అదనుగా తీసుకొని అదుపు లేకుండా ప్రభుత్వం విప్లవకారులను చంపడం సాగించింది. విద్యార్థి నాయకుడు జంపాలప్రసాద్‌తోబాటు నీలం రామచంద్రయ్య, పోట్ల రామనర్సయ్య, వరంగల్‌లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన సూరపనేని జనార్ధన్‌తోబాటు పైడిపెల్లికి చెందిన మురళీమోహన్, ఆనంద్‌రావుల ఎన్‌కౌంటర్ జరిగింది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో ఎక్కువ సంఖ్యలో విప్లవ నాయకుల్ని ప్రభుత్వం హత్య చేయడం జరిగింది. సరిగ్గా ఈ సమయంలోనే అంటే 1974లో బాలగోపాల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్.ఎస్.సి చదవడానికి చేరాడు. ఎమర్జెన్సీలో జరిగిన బీభత్సాన్ని గమనించి వుంటాడు. తనతోబాటు చదువుకుంటున్న విద్యార్థి సూరపనేని జనార్ధన్ హత్య ఆయన్ను వ్యాకులపరచి వుంటుంది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయిన జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా ప్రజాస్వామిక ఉద్యమాలు ప్రారంభమైనాయి. మన రాష్ట్రంలో విప్లవ పార్టీలకార్యక్రమాలు మళ్ళీ ఊపందుకొన్నాయి. కొంత కాలం స్థబ్దతగా వున్న పౌరహక్కులసంఘం మళ్ళీ రంగనాథం, విఠల్‌రావు, కాశీపతి గార్లు కన్వీనర్లుగా పునర్జీవనం పోసుకొంది. వరంగల్‌లో చంద్ర పుల్లారెడ్డిగారి నాయకత్వంలోని విప్లవ పార్టీ, దాని ప్రజా సంఘాలు,



గోదావరి తీరం వెంబటి గ్రామాలలో ఫారెస్టు కాంట్రాక్టర్ల దౌర్జన్యానికి వ్యతిరేకంగా, ఆదివాసీలపై వ్యాపారస్తులజులుంకు వ్యతిరేకంగా, తునికాకు రేట్ల పెంపుదలకై, అడవిపై ఆదివాసీలహక్కులకై పోరాటాలు మొదలు పెట్టాయి. ఇంకొక వైపు కరీంనగర్ జగిత్యాలలో, ఆదిలాబాద్‌లో, వరంగల్‌లోని చుట్టుప్రక్కలగ్రామాలల్లో కొండపల్లి సీతారామయ్య గారి నేతృత్వంలోని నక్సలైట్ పార్టీ, రైతు–కూలీ సంఘాలు, యువజన సంఘాలు ఏర్పరచి పెద్ద ఎత్తున కూలీరేట్ల ఉద్యమం మొదలైంది. కొంత కాలం మౌనంగా వున్న మన రాష్ట్రంలో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలపై నిర్బంధం అమలు చేయడం ప్రారంభించింది. జగిత్యాలజైత్రయాత్రను వీక్షించిన ప్రభుత్వం గాబరాపడి కరీంనగర్‌లోని కొన్ని తాలుకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. వరంగల్ జిల్లాలో ములుగు, ఏటూరు నాగారం, పస్రా, వెంకటాపురం ప్రాంతాలల్లో నడిచే ఉద్యమాలపై నిర్బంధం ప్రారంభించింది. పౌరహక్కులకార్యక్రమాలకి వరంగల్ కేంద్రంగా వుండేది. పౌరహక్కులసంఘం రాష్ట్ర కార్యవర్గంలో

యస్. జీవన్‌కుమార్

ఆరుగురు సభ్యులు వరంగల్ నుంచే ప్రాతినిధ్యం వహించారు. ఢిల్లీకి చెందిన పీయుసిఎల్ & డిఆర్ హక్కులసంఘం అయిదు రోజులు కల్లోలిత ప్రాంతాలు తిరిగి నివేదిక విడుదలచేసింది. ఇందులో వరంగల్‌లో వున్న మేమంతా ప్రధాన పాత్ర వహించాం. ఆ నివేదిక ఆధారంగా కల్లోలిత ప్రాంతాలచట్టాన్ని ఎత్తివేయాలనే ప్రచారం ప్రారంభించాం. అత్యవసర పరిస్థితి కాలంలో జరిగిన అత్యాచారాలపై విచారణ జరిపిన తార్కుండే కమిటీ రిపోర్టును కాళోజి గారింట్లో విడుదలచేసాం. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్ హత్యలు, చిత్రహింసలసంఘటనలు విచారించడానికి భార్గవ కమీషన్ ఏర్పాటయింది. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌పై సాక్ష్యాలు సేకరించడానికి అరుణ్‌శౌరితోపాటు మేము గ్రామాలు తిరిగాం. పౌరహక్కులసంఘం, విప్లవ పార్టీలు, వాటి అనుబంధ విద్యార్థి, యువజన సంఘాలు భార్గవ కమీషన్ ముందు వాధిస్తున్న కన్నాభిరాన్ గారికి, సాక్ష్యాలసేకరణ నుండి, సాక్షులకు రక్షణ కల్పించే విషయం వరకు అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. వరంగల్ పౌరహక్కులసంఘం యూనిట్ ఖమ్మం జిల్లా పండితాపురంలో చెరువు శిఖం భూమి విషయంలో ఆందోళన చేస్తున్న ప్రజలపై కాల్పులు జరపడం, ప్రజలు పోలీసులపై తిరుగుబాటు చేయగా ఒక సి.ఐ. గాయాలపాలై మరణించిన విషయంలో విషయం సేకరణ చేసింది.

ఇవన్నీ జరుగుతుండగా బాలగోపాల్ ఎమ్.ఎస్.సి. పూర్తిచేసి వరంగల్‌లోనే పి.హెచ్‌డి కోసం చేరాడు. వరంగల్ ఫిల్మ్‌సొసైటీ 1977లో ప్రదర్శించిన సత్యజిత్‌రాయ్ సినిమాలు చూడటానికి, వాళ్ళ ప్రొఫెసర్‌తోబాటు వచ్చాడు. అప్పుడు బాలగోపాల్ నాకు పరిచయమయ్యాడు. ఆ సమయంలో వరంగల్‌లో ఒక అనూహ్యమైన ప్రజాస్వామిక వాతావరణం వుండేది. వరంగల్ ఫిలిం సొసైటీ, విరసం, సొసైటీ ఫర్ సోషల్ సైన్సెస్, టీచర్స్ నిర్వహించే విద్యావంతులఫోరమ్, వినియోగదార్ల సంఘం, కాళోజీ ఇంట్లో ప్రతి రెండవ శనివారం జరిగే మిత్ర మండలి, వరవరరావు గారి ఇంట్లో 'సృజన' కోసం రచనలు చదివే సాహితీమిత్రులు, కాలేజీలలో వామపక్ష విద్యార్థులకార్యక్రమాలు వాళ్ళు వేసే ప్రశ్నలపై లోతైన విశ్లేషణలు, చర్చలు జరుగుతుండేవి. ఈ తరుణంలో బాలగోపాల్ వరవరరావు గారితో పరిచయం చేసుకొని సృజన సాహితీ మిత్రులకు రావడం ప్రారంభించారు. అప్పుడే మొదటి ఆర్.ఎస్.యు, ఆర్.వై.ఎల్. మహాసభలు వరంగల్‌లో జరిగాయి. కొండపల్లి సీతారామయ్యగారు అజ్ఞాతంలోంచి బయటకు వచ్చి వరంగల్‌లోని ఒక గుడి హాలులో భారతదేశ ఆర్థిక పరిస్థితిపై బ్రహ్మాండమైన విశ్లేషణతో కూడిన ఉపన్యాసం చేశారు. అదే రోజు కాకతీయ మెడికల్ కాలేజీలో పనిచేసే దేశాయిపేటకు చెందిన జన్ను చిన్నాలు అనే దళితుడ్ని, ఒక చిన్న విప్లవ గ్రూపు పోలీసులసహకారంతో హత్య చేసింది. 'సృజన' కార్యకలాపాలకు పరిచయమైన బాలగోపాల్ ముందుగా సాహిత్యం మీద మాట్లాడం, రాయడం మొదలు పెట్టాడు. 1979 నుండి 1981 వరకు ఆయన వ్యాసకర్తగా, ఉపన్యాసకుడిగా గుర్తింపబడ్డాడు. సృజనలో వచ్చిన ఒక వ్యాసంపై చర్చలో బాలగోపాల్ పేరు మొదటిసారిగా బయటకు వినిపించింది. అప్పుడే ఇ.పి.డబ్ల్యూలో కూడా రాయడం ప్రారంభించారు.

1979లో వరంగల్‌లో జరిగిన ప్రథమ పౌరహక్కులసంఘం రాష్ట్ర మహాసభలో కన్నాభిరాన్ అధ్యక్షుడిగాను, బి. ప్రదీప్ కార్యదర్శిగాను ఎన్నికైనారు. బాలగోపాల్ రాస్తున్న వ్యాసాలు, చేస్తున్న ప్రసంగాలు గమనించి 1981లో బాలగోపాల్‌ను నేరుగా పౌరహక్కులసంఘం రాష్ట్ర కార్యవర్గానికి తీసుకోవడం జరిగింది. పౌరహక్కులసంఘంలోకి రాగానే నల్గొండ జిల్లాలో జరిగిన పర్షయ్య, రవీందర్‌రెడ్డిల ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణ కమిటీలో సభ్యుడుగా వెళ్ళి, ఆ నివేదిక తానే రాశాడు. ఆ నివేదికలో వున్న స్పష్టత, విషయాలను పొందుపరచిన విధానం చూసి మేమంతా ఆశ్చర్య పోయాం. అప్పటి నుండి హక్కులసంఘ నిజనిర్ధారణ నివేదికలు ఎట్లా రాయాలో మేం నేర్చుకోవడం మొదలు పెట్టాం. సంఘటన ఎట్లా జరిగింది, వాస్తవాలవరుస క్రమం విషయాన్ని నిష్పాక్షికంగా చూడటం ప్రధానం అని ఆయన చెప్పేవాడు. మరణించిన లేక చిత్రహింసలకు గురైన కార్యకర్త ఏ రాజకీయ గ్రూపుకు చెందిన వాడు అనేది మనకు ప్రధానం కాదు, సంఘటనకు దారితీసిన వాస్తవ పరిస్థితులపై దృష్టి పెట్టాలి అని అనేవాడు. బాలగోపాల్ హక్కులఉద్యమంలోకి రాక ముందు మేం రాసిన నివేదికల్లో ముందు ఉద్యమ నేపథ్యం వివరించే వాళ్ళం. తర్వాత నేపథ్యం గురించి రాయడం మానుకున్నాం. అందువల్లనే క్రమ క్రమంగా పౌరహక్కులసంఘం నివేదికలకు అధిక విశ్వసనీయత చేకూరింది. ప్రభుత్వంగాని, పోలీసులు కాని ఇంతవరకు పౌరహక్కులసంఘం, మానవ హక్కులవేదికలు ప్రచురించిన నివేదికలలోని వాస్తవికతను ఎప్పుడూ వివాదం చేయలేదు. ఈ విధంగా బాలగోపాల్ హక్కులకార్యకర్త ప్రయాణం మొదలైంది. 1983లో ఖమ్మంలో జరిగిన రెండవ రాష్ట్ర మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత బాలగోపాల్ రెండవ దశ మొదలైంది. సాహిత్యం గురించి రాయడం, మాట్లాడం చాలా వరకు తగ్గించి హక్కులఅంశాలపైనే దృష్టి సారించాడు. ఈ దశలో ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు, లాకప్ మరణాలగురించి రిపోర్టులు ప్రచురిస్తూ నిర్మాణం మీద కూడా దృష్టి సారించాడు. పౌరహక్కులసంఘంలో విప్లవ పార్టీలప్రతినిధులరూపంలో సభ్యులుండటం సరియైంది కాదని, రాజకీయ అభిప్రాయాలలో వుండవచ్చు గాని, హక్కులఅంశంపైనే పనిచేయడం సంస్థకు, ఆరోగ్యకరం అని భావించి విరసం నాయకుల్ని, ఇతర ప్రజా సంఘాలనాయకుల్ని వాళ్ళ రంగంలోనే పనిచేసుకోమని, హక్కులసంఘం పూర్తిగా హక్కులకోసం పనిచేసే కార్యకర్తలకు మాత్రమే వదిలివేయమన్నాడు. జిల్లాలలో యూనిట్‌లు పెట్టి నిర్మాణం పటిష్టపరుస్తున్న తరుణంలోనే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రామనాథంను పోలీసులు హత్య చేయడం జరిగింది. ఈ సంఘటన బాలగోపాల్‌ను పూర్తి స్థాయి హక్కులకార్యకర్తగా తయారు కావడానికి దోహదపడింది. ఇంత భయంకరంగా ప్రవర్తిస్తున్న రాజ్యాన్ని నిలదీయడానికి, దాని దుశ్చర్యలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం సేకరించడానికి పూర్తి స్థాయిలో పనిచేయడం అవసరం అని భావించి కాకతీయ యూనివర్సిటీలో లెక్చరర్ పదవికి రాజీనామా చేసి కార్యరంగంలోకి దూకాడు. వరంగల్‌లో వున్నప్పుడే గ్రామాల్లో వున్న పోలీసు క్యాంపుల్ని ఎత్తివేయడానికి ఒక ప్రయోగం చేసాడు. హన్మకొండ మండలంలోని బట్టుపల్లి పంచాయతీ ఆఫీసులో వున్న సి.ఆర్.పి. క్యాంపు, మరియు రాంపూర్ గ్రామంలోని స్కూల్‌లో పెట్టిన పోలీసు క్యాంపులు, ప్రజలను వాళ్ళ ప్రజాస్వామిక హక్కులనుండి

PDF processed with CutePDF evaluation edition www.CutePDF.com

దూరం చేసాయని కోర్టులో కేసు వేసి కన్నాభిరాన్ గారి ద్వారా అవి ఎత్తి వేయాలనే ఆర్డర్ తీసుకొచ్చాడు. దీంతో మొదలుకొని చివరి వరకు హక్కులఅంశాలపై విన్నూతన దృక్పోథంలో ఉద్యమం నిర్వహించాడు.

1990 దశకం కల్లా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కులసంఘం అన్ని జిల్లాలలో యూనిట్‌లు ఏర్పరచుకుంది. ప్రతి ఎన్‌కౌంటర్, లాకప్ మరణం, చిత్రహింసలసంఘటనను పరిశీలించి నివేదికలు తయారు చేయడం మొదలు పెట్టి, పోలీసు అత్యాచారాలకు వ్యతిరకంగా బలమైన ప్రజాభిప్రాయం కల్పించడం జరిగింది. “అసలు ప్రపంచంలోని ఏ దేశంలో కూడా ఇంత నిర్మాణం వుండి, ప్రతి హక్కులఉల్లంఘనపై నివేదికలు తయారు చేసే సంస్థ లేదని” జాతీయ మానవ హక్కులకమీషన్ మొదటి చైర్మన్ రంగనాథ్ మిశ్రా, ఎన్‌కౌంటర్లపై విచారణ జరపడానికి వచ్చినప్పుడు వ్యాఖ్యానించారు. విస్తృతమైన నిర్మాణంతోబాటు నిరంతరమైన పని విధానాన్ని బాలగోపాల్ అమలులోకి తెచ్చాడు. జిల్లాలో జరిగే ఏ సంఘటనకైనా రాష్ట్ర కమిటీ వాళ్ళేవరైనా ఉన్నా లేకున్నా బాలగోపాల్ తను మాత్రం వుండాలనే ఒక నియమాన్ని పెట్టుకున్నాడు. ఇదే ఒరవడిలో జిల్లా బాధ్యులు కూడా సంఘటన జరగగానే ఫోన్ చేసి ఆయన డేట్స్ తీసుకోవడం అలవర్చుకున్నారు. రాష్ట్ర కార్యవర్గం కూర్చునప్పుడే ఆయన దాదాపు రెండు నెలలకార్యక్రమాన్ని జిల్లా కార్యకర్తలతో సంప్రదించి తయారు చేసుకునేవాడు. ఇట్లా పనిచేస్తున్న క్రమంలో పౌరహక్కులసంఘానికి రెండు మూడు సవాల్‌లు ఎదురయ్యాయి. వివిధ విప్లవ గ్రూపులమధ్య వుండే శత్రు వైఖరి విషయంలో మన పాత్ర, బాధ్యత ఏమైనా వుందా అనేది మొదటి ప్రశ్న. ఈ ప్రశ్న వచ్చినప్పుడల్లా కొంత కాలం దీంట్లో పౌరహక్కులసంఘం జోక్యం, పాత్ర ఉండదని ఖచ్చితంగా చెప్పేవాళ్ళం. కాని క్రమక్రమంగా విప్లవ పార్టీలమధ్య వుండే వైఖర్లు భౌతికదాడులు, భౌతిక నిర్మూలన వరకు పోయాయి. ఒక దశలో మెదక్‌లో ఒక రాజకీయ విశ్వాసానికి చెందిన వారిని 19 మందిని ఇంకొక గ్రూపు వారు హత్య చేశారు. ఇది హర్షించదగ్గ విషయం కాదు, ఎవరి రాజకీయ విశ్వాసాలు, పంథాలు ఎట్లా వున్నా, మిత్రులుగా లేకున్నా శత్రుత్వం పనికి రాదని బాలగోపాల్ చాలా ఖచ్ఛితంగా దాన్ని ఆపడానికి మనం జోక్యం చేసుకోవాలసిందే అన్నాడు. దీనిపై కార్యవర్గంలో నిర్ణయం తీసుకోవడమే కాకుండా, రెండు పక్షాల నాయకులను కలిసి చాలా గట్టిగా మాట్లాడవలసి వచ్చింది. కిడ్నాపులు జరిగినప్పుడు మన పాత్ర ఏమీ వుండదు అని భీష్మించుకు కూర్చున్న వాళ్ళు చివరకు కిడ్నాపుల్లోనే కాకుండా విప్లవ పార్టీలమధ్య ఘర్షణలు వుంటే, అవసరమైతే జోక్యం చేసుకోవాలనే సూత్రీకరణకు రావడం జరిగింది.

రాజ్యాంగ యంత్రాంగం ప్రజలపైన ప్రయోగించే హింస, లాఠీ తూటాలప్రయోగం, భావ ప్రకటన స్వేచ్ఛపైన దాడి, రాజకీయ స్వేచ్ఛ నిరాకరణ ఎప్పుడూ వుండేవే. అంతేగాకుండా సమాజంలో నూతనంగా ఉత్పన్నం అవుతున్న పరిస్థితులను, నూతనంగా ఆవిర్భవిస్తున్న చైతన్యాన్ని ఆకళింపు చేసుకొని, పౌరహక్కులసంఘం తన అవగాహనను, ఆచరణను మెరుగు పరచుకోవాలని కర్నూలులో జరిగిన మహాసభలో అభిప్రాయపడ్డాడు. అందులో భాగంగానే సమాజంలో ముందుకు వచ్చే ప్రతి ప్రజా ఉద్యమమూ, ప్రజా చైతన్యంతో ఒక్క కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని, అంత వరకు కనిపించని అణచివేతను వేలెత్తి చూపించి పౌరహక్కులఅవగాహనకు కొత్త ద్వారాలు తెరుస్తుందని అభిప్రాయపడ్డాడు. హక్కులఅతిక్రమణను కేవలం ప్రత్యక్ష భౌతిక హింసగాకాక వ్యవస్థీకృతమయిన ఉల్లంఘనగా అర్థం చేసుకునే క్రమంలో అనేక ఇతర సమస్యలను కూడా పౌరహక్కులసమస్యలుగా చూడాలన్నాడు. కరువు, కాలుష్యం, మిల్లులమూసివేత, కుటుంబాలలో స్త్రీలపై హింస, నిరుద్యోగం, ప్రాజెక్టులవల్ల నిర్వాసితులయ్యే నిరాశ్రయత లాంటివన్ని కూడా జీవించే హక్కును భంగం కలిగించేవిగా చూడాలన్నాడు. సమాజంలో నిత్యం ఉత్పన్నమయ్యే సమస్యల్ని పట్టించుకొని, అధ్యయనం చేసి, ప్రచార కార్యక్రమం చేపట్టే క్రమంలోనే వాటిని పౌరహక్కులఉద్యమం తన అవగాహనలోనూ, ఆచరణలోనూ అంతర్లీనం చేసుకోవాలన్నాడు. కారంచేడు మారణకాండ ఇంకొక మౌలికమైన వాస్తవాన్ని పౌరహక్కులఉద్యమానికి నేర్పిందని చెపుతూ, “వ్యవస్థీకృతమయిన అణచివేత కేవలం భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆధిపత్యంలోనూ, వాటిని కాపాడే రాజ్యహింసలోనూ లేదు, పౌర సమాజం లేక సభ్య సమాజం అని పిలవబడే రాజ్యేతర సామాజిక వ్యవస్థలోనూ వుందని” చెప్పాడు. భారతదేశ సమాజంలో కులం పాత్ర గురించి చెప్తూ కులహింస, కులవ్యవస్థలనేకాక, కులవ్యవస్థ భావజాలాన్ని కూడా ఎదుర్కొనే కర్తవ్యం పౌరహక్కులఉద్యమం స్వీకరించాలన్నాడు. అసలు భారతదేశంలో హక్కులఉద్యమం కులవ్యవస్థ నేపథ్యంలో, అంబేద్కర్ భావజాలం వెలుగులో ప్రారంభం కావాలి. కాని దురదుష్టవశాత్తు లిబరల్ ఆలోచన వెలుగులో, వామపక్ష భావాలవెలుగులో హక్కులఉద్యమం ఆవిర్భవించిదని, ఇప్పటికైనా మనం మన ఆచరణలో దాన్ని సరిచేసుకోవాలని చాలా స్పష్టంగా బాలగోపాల్ ఒక చోట అంటాడు. అన్ని సామాజిక ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలు ముందుకు తెస్తున్న అంశాలను వాటిలోని నైతికతను హక్కులభాషలో క్రోడికరించి, ఆ విలువలను హక్కులసంఘం దృక్పథంలోకి ఇముడ్చుకునే ప్రయత్నం చేయాలంటాడు. అయితే ఈ సామాజిక ఉద్యమాలలో హక్కులసంఘాలు భాగంగా వుండకుండా ఆ ఉద్యమాలు లేవదీస్తున్న ప్రశ్నలను, చైతన్యాన్ని, ఆకాంక్షలను గౌరవిస్తూ వాటిని హక్కులతాత్విక భావనలోకి తెచ్చే ప్రయత్నం నిరంతరం చేయాలని చాలా స్పష్టంగా బాలగోపాల్ చెప్పాడు.

ఇట్లా హక్కులతాత్వికతను, ఆలోచన్లను వెదజల్లుతూ వస్తున్న క్రమంలో, విప్లవ ఉద్యమాలఆచరణ విషయంలో కొంత బాధను వ్యక్తం చేసాడు. ప్రపంచ వ్యాప్తంగా హక్కులసంఘాలు మరణ శిక్షకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. కాని విప్లవ పార్టీలు ఇన్‌ఫార్మర్ పేరుతో మనుషులను చంపడం, హింసించడం సరియైంది కాదని భావించాడు. న్యాయ స్థానాలు వేసే ఉరిశిక్షలో ఒక పద్దతి వుంటుంది, నేరం ఆరోపింపబడి వ్యక్తికి చెప్పుకునే అవకాశం వుంటుంది. అంచెలంచెలుగా న్యాయ స్థానాలకు పోయే అవకాశం వుంటుంది, చివరకు క్షమించమని అడిగే అవకాశం వుంటుంది. కాని విప్లవ పార్టీలశిక్షలఅమలు విషయంలో అది జరగడం లేదన్నాడు. ప్రజలతో బాధ్యతగా, ప్రజాస్వామికంగా విప్లవ పార్టీలమెసలుకొక పోవడం సరియైంది కాదని అభిప్రాయపడ్డాడు.

సంస్థలో ఈ అంశాలపై చర్చించడానికి, అభిప్రాయాలు వెల్లడించడానికి పూర్తి ప్రజాస్వామిక పద్ధతులు ప్రవేశపెట్టాడు. అవగాహన విషయంలో చర్చకు పెట్టవలసిన విషయాలపై విభిన్న దృక్పథాలతో వ్యాసాలు రాయించి, పుస్తకంగా వేసి సంస్థలో జిల్లా స్థాయి నుంచి, రాష్ట్ర కార్యవర్గ సమావేశం ద్వారా, రాష్ట్ర మహాసభ నిర్వహించి చర్చ నిర్వహించడం జరిగింది. ఈ పక్రియ అంతా దాదాపు రెండు సంవత్సర కాలం ప్రజాస్వామిక పద్దతుల్లో జరపడం జరిగింది. విభేదిస్తున్న వాళ్ళు సమీకరణ చేసి, క్యాంపులు పెట్టినా కూడా అభ్యంతరం చెప్పలేదు. చాలా ముఖ్యమైన క్రింద పేర్కొన్న మౌలికమైన అంశాలచర్చను పత్రికలు, కావాలని కొందరు వ్యక్తులు రాజ్యహింస – ప్రయివేటు హింస మధ్య చర్చగా సూత్రీకరించారు.

1. హక్కులఉల్లంఘన కేంద్రం కేవలం రాజ్యమేనా, లేక సమాజంలో వున్న ఇతర వ్యవస్థలు కూడానా.

2. హక్కులసంఘానికి తనదంటూ స్వతంత్ర ఆలోచన, కార్యక్షేత్రం, ప్రతిపత్తి వుండాలా లేదా.

3. హక్కులసంఘం హక్కులఅంశంపై పనిచేయడానికి కేవలం ఇతర హక్కులసంఘాలతో కలిసి కార్యాచరణ రూపొందించుకోవాలా లేక రాజకీయ పార్టీలకు అనుబంధంగా వున్న ప్రజాసంఘాలతో కూడా కార్యాచరణలో భాగం కావచ్చా.

4. విప్లవ ఉద్యమాలకు ఒక సమగ్రమైన మానవీయ నైతిక చట్టం వుండాలా వద్దా?

5. విప్లవ సంస్థలు ప్రజలతో అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తే, అనవసర వత్తిడి, హింస ప్రయోగిస్తే, హక్కులసంఘంగా మనం అది తప్పని వాళ్ళకు చెప్పే అవసరం వుందా లేదా.

ఈ అంశాలను చర్చకు పెట్టిన తర్వాత సంస్థ దృక్పథానికి, తన దృక్పథానికి తేడా వుంది కాబట్టి సంస్థలో కొనసాగడం సరియైంది కాదని వెంటనే రాజీనామా చేశాడు. కొద్ది నెలలతర్వాత మైనార్టీ అభిప్రాయంగా వున్న మేమంతా కూడా రాజీనామా చేసి ప్రత్యేకమైన కార్యక్షేత్రం, విశాలదృక్పథం, స్వతంత్ర ప్రతిపత్తి అంశాలుగా ‘మానవ హక్కులవేదిక’ ఏర్పరచుకోవడం జరిగింది.

ఈ మొత్తం హక్కులప్రయాణంలో బాలగోపాల్ అశేషమైన కృషి చేశారు. ఆయన ఆచరించిన క్రమశిక్షణ క్రమబద్ధమైన పని విధానం, సంస్థ జిల్లా, రాష్ట్ర కార్యవర్గం నిర్వహించడం మొదలుకొని, చింతపల్లిలో గిరిజన గూడెొలను కాల్చినప్పుడు నిర్వహించిన ఇండియన్ పీపుల్స్ ట్రిబ్యునల్, ఎన్‌కౌంటర్లపై జాతీయ మానవహక్కులకమీషన్ విచారణ, బషీర్‌బాగ్ దగ్గర ప్రజలపై జరిపిన కాల్పులసంఘటనను విచారించేందుకు ఏర్పాటు చేయబడ్డ కమీషన్ నిర్వహించిన పద్ధతి వరకు మనకు కనబడుతుంది.

బాలగోపాల్ ఒక పద్ధతి ప్రకారం తన భావాలను, హక్కులభాషను ప్రాచుర్యంలోకి తీసుకవచ్చారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆయన చెప్పే హక్కులఅంశాలకు, ఆయన భావనలకు అతి ఉన్నత పదవిలో వున్న ప్రభుత్వ అధికారి నుండి గ్రామంలో వుండే అతి సామాన్య మనిషి వరకు అంగీకారం వస్తూ వుంది. ఆయన వివిధ దశల్లో భావ ప్రచారం, చైతన్యం వ్యాప్తి చేసే ప్రయత్నం చేసాడు. దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా విషయాలు తెలుపడం కోసం ఇ.పి.డబ్ల్యూ పత్రికలో వరుసగా వ్యాసాలు రాయడం. తెలుగు పత్రికల్లో హక్కులఅంశాలపై వ్యాసాలు రాయడం, తన భావాలను క్షేత్రంలో ప్రజలముందు పెట్టి వాళ్ళకు అర్థమయ్యే రీతిలో చెప్పడం. చివరగా ఇదంతా క్రోడీకరించి న్యాయం, చట్టం పరిభాషలో న్యాయమూర్తి మెదడులోకి ఎక్కించి బాధితుడికి కొంత ఊరట కలిగించడం. ఈ మొత్తం ప్రక్రియను, భావనలను బాలగోపాల్ వ్యక్తిగా కాకుండా పౌరహక్కులసంఘం, మానవ హక్కులవేదికలద్వారా చెప్తూ సంస్థలకు విలువైన విశ్వసనీయతను సంపాదించి పెట్టాడు.

విషయాలపై చర్చించడానికి, సెక్రెటేరియట్‌లో అధికార్ల దగ్గరకు, మినిస్టర్ల దగ్గరకు, పోలీసు ఉన్నతాధికార్ల దగ్గరకు ఆయనతో నేనే వెళ్ళేవాడిని. మేము వాళ్ళకిచ్చే మెమోరాండంలో వివరించిన అంశాలకు, ఆయన వాళ్ళ ముందు చర్చకు తెచ్చే అంశాలకు ఎక్కడ తేడా వుండేదికాదు. బాలగోపాల్‌ను వింటూ వాళ్ళంతా సంభ్రమాశ్చర్యంలో మునిగిపోయేవారు. విషయాలపట్ల అవగాహన కల్పించడానికి, విషయాల్ని ప్రభుత్వ దృష్టికి తేవడానికి, ప్రజలకు ధైర్యం నూరిపోయడానికి ఆయన చాలా పద్ధతులు సంస్థలకు నేర్పాడు. కరపత్రాలు వేయడం, వ్యాసాలు రాయడం, అర్జీలు పెట్టడం, ధర్నాలు, ఊరేగింపులు నిర్వహించడమే కాకుండా ప్రజల్లోకి వెళ్ళి వాళ్ళను సమాయాత్త పరుస్తూ పాదయాత్రలు చేసే ప్రక్రియను చాలా విజయవంతంగా నిర్వహించాడు. తన ఆలోచనలు, కార్యచరణను సంస్థ సంస్కృతిలో భాగంగా చేశాడు. ఆయన అతి సాధారణ జీవిత శైలి, 34 సంవత్సరాలు నేను ఆయనతో కలిసి వేసిన ప్రతి అడుగు ఎంతో గౌరవంగా భద్రపరచుకోవలసిన విషయం. కాదు బాలగోపాల్ మరణించలేదు. మానవ హక్కులవేదికలో ఎప్పుడూ బతికే వుంటాడు. ఆయన కార్యకర్తగా తనకు తాను నిర్దేశించుకున్న ప్రమాణాలు మేము పెట్టుకొని పాటించలేము. కాని ఆయనకు పేద ప్రజలపట్ల వుండే మమకారం, ఆయన కార్యదీక్ష, ఆయన నిర్మలత్వం, నిర్భయం మేమంతా దగ్గరగా చూసాం. ఈ లక్షణాలు మాలో ఏ కొంచెం వున్నా వాటికి ప్రాణం పోసుకొని మేం సంస్థను నడిపిస్తాం.

# ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టాలని ఇల్లందులో ధర్నా

ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెంటనే అరికట్టాలనీ డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమొక్రసీ ఇల్లందు సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు యం.డి.ఓ. ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ రాజు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో చేసిన పనులను అధికారులు వారి ఇష్టం వచ్చిన పద్దతులలో కొలుస్తున్నారనీ, ఒకే పనికి కూలీలలో తేడాగా కూలీ ఇస్తూ అందిన కాడికి మింగుతున్నారన్నారు. అవినీతిని వెంటనే అరికట్టి కూలీలకు న్యాయం చేయాలనీ, గత సంవత్సరంలో చేసిన పనులకు బిల్లులను వెంటనే మంజూరు చేయాలనీ, 100 రోజులపనిని 150 రోజులకు పెంచాలని కా॥ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్. చైర్మన్ కిన్నెర నర్సయ్య, పార్టీ సబ్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ కిరణ్, ప్రసాద్, బుర్ర వెంకన్న, జలీల్ పాష, వివిధ గ్రామాలసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ధర్నా

ఖమ్మం జిల్లా ఇల్లందులో సి.సి.ఐ. ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమొక్రసీ, ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 20న ప్రదర్శన, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది.

ఈ కార్యక్రమానికి హాజరైన రైతాంగాన్ని వుద్దేశించి ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కా॥ జగ్గన్న మాట్లాడుతూ, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మధ్య దళారులదోపిడీని అరికట్టకుండా, చిల్లర కౌంటర్లను రద్దు చేయకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రద్దు చేసే ఆలోచనను చేయటం రైతు వ్యతిరేక చర్య అన్నారు. ఇల్లందులో సి.సి.ఐ. ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శికి ప్రతినిధి బృందం మెమోరాండం అందజేసింది. ఈ కార్యక్రమంలో పార్టీ, ఎఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ రాజు, బిచ్చా, సారంగపాణి, బుర్ర వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.